

మంచిర్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# దళితుల గొంతు కోస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

## ఎమ్మెల్యేకు రూ.200 కోట్లు..రైతులకు 13.5 లక్షలా ?

- భూసేకరణలో నిబంధనలు పాటించని అధికారులు
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 24: ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు విషయంలో వేంపల్లి, ముల్కల్ల గ్రామాలకు చెందిన దళిత, బీసీ కుటుంబాలకు చెందిన భూములను తక్కువ ధరకు (13.50 లక్షలకు) ఎకరం చొప్పున నష్ట పరిహారం చెల్లించి, అధికారులు, అధికార పార్టీ నాయకులు బెదిరించి వారి భూములను లాక్కున్నారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. శనివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, భూబాధితులతో కలిసి మాట్లాడారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట ఎమ్మెల్యే పెద్ద స్కెచ్ వేశాడని, ఏకంగా రూ. 200 కోట్లు దండుకోవాలని చూస్తున్నాడని, భూములు ఇచ్చిన రైతులకు మాత్రం కేవలం రూ. 13.50 లక్షలు ఇస్తున్నాడని అన్నారు. అసలు భూసేకరణ విషయంలో కలెక్టర్, ఆర్డీవోలు నిబంధనలు పాటించలేదని, 2013 ఆర్‌ఓఆర్ చట్టాన్ని కాదని 2017 చట్టం పేరిట భూములను బలవంతంగా సేకరించారని, నోటిఫికేషన్‌కు ముందే రైతులతో సంతకాలు తీసుకున్నారని అన్నారు. బయట మార్కెట్ విలువ ఎకరానికి కోటి రూపాయలు ఉంటే ఇక్కడ మాత్రం రూ. 13.50 లక్షలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చాక భూములు ఇచ్చిన వారికి తిరిగి అందజేస్తామని అన్నారు. అక్కడ భూమి కొందాం అనుకుంటున్నా ప్రతి వ్యక్తి ఒకటికి పది సార్లు ఆలోచించుకోవాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత, బీసీ రైతులకు భూమి యజమానులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అందుకే ఈ భూములను కొనేముందు ఎవరైనా సరే ఆలోచించుకోవాలని సూచించారు.

### అక్రమంగా భూమిని పట్టా చేయించుకున్నారు..

ముల్కల్ల గ్రామానికి చెందిన దళితులమైన తమ ఆరు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టా చేయించుకుని ఇండస్ట్రియల్ పార్క్‌కు ఇచ్చారని పలువురు బాధిత మహిళలు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయనను కోరారు. 2009 సంవత్సరంలో దళితులమైన తమకు 25 గుంటల చొప్పున భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇంకా భూమిలేని చాలా మంది భూమి కోసం ఎదురు చూస్తున్నారని, అయితే అక్కడ తమకోసం కేటాయించాల్సిన భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకుని ఇండస్ట్రియల్ పార్క్‌కు ఇచ్చి పరిహారం పొందుతున్నారని తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, తహసీల్దార్‌ను విచారణ చేపట్టాలని ఆదేశించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని చెప్పారు. ఈ విషయంపై దివాకర్‌రావు మాట్లాడుతూ దళితుల పక్షాన న్యాయం కోసం పోరాడుతానని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు గాదెసత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, బేర సత్యనారాయణ, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కాటం రాజు, సత్తయ్య, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, ఎడ్ల శంకర్, శ్రీరాముల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని కొంటాం

- 'నమస్తే' కథనానికి స్పందన

కౌటాల, మే 24 : కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలోని ముత్తంపేట, సిర్పూర్(టీ) మండలం పారిగాం వద్ద రోడ్డుపై రైతులు రాస్తారోకోలు చేశారు. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో 'తడిసిన ధాన్యం కొనాలి' అనే శీర్షికన వచ్చిన కథనానికి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా కో ఆపరేటివ్ అధికారి (డీసీవో) రైతులు పండించిన వరి పంటను తప్పకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని తెలియజేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేకు లేఖ రాశారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంటను అధికారులు కొనేందుకు ముందుకు రావడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.




GOVERNMENT OF TELANGANA
COOPERATION DEPARTMENT

కలెక్టర్‌కు డీసీవో రాసిన లేఖ

# గడ్డం ఫ్యామిలీకి గడ్డుకాలం

కాకా కుటుంబాన్ని పట్టించుకోని సొంత పార్టీ కేడర్

- వివేక్ సొంత నియోజకవర్గం చెన్నూర్‌లోనే తిరగబడుతున్న నాయకులు
- 'ఎమ్మెల్యే బీజేపీకి పోతారో, కాంగ్రెస్‌కు పోతారో' అంటూ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వ్యాఖ్యలు
- మొన్నటికి మొన్న మంచిర్యాలలో గడ్డం వంశీ వర్గాన్ని అడ్డుకున్న స్థానిక ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ వర్గం
- పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పని చేయని ఆ కుటుంబ పరపతి
- సొంతంగా కేడర్‌ను డెవలప్ చేసుకునే పనిలో కాక వారసులు..?
- కాంగ్రెస్‌లో చీలికలు తీసుకువస్తున్నారంటూ మండిపడుతున్న సొంత పార్టీ లీడర్లు



మంచిర్యాల, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో గడ్డం వెంకటస్వామి కాకా కుటుంబాన్ని సొంత పార్టీ నాయకులే పట్టించుకోవడం లేదు. మొన్నటికి మొన్న చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సంస్థాగత ఎన్నికల పరిశీలకుల ముందే మందమర్రి నుంచి టీపీసీసీ సభ్యుడిగా ఉన్న ఓ నాయకుడు (ఎమ్మెల్యే సన్నిహితుడు), చెన్నూర్‌కు చెందిన మాజీ వార్డు కౌన్సిల్ పరస్పరం గొడవకు దిగారు. పార్టీలో ముందు నుంచి ఉన్న వారికి కాకుండా, ఈ మధ్య పార్టీలో చేరిన వారికి ప్రియార్టీ ఇస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసుకునే దాకా వెళ్లారు. ఈ క్రమంలోనే కోటపల్లి మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి మా ఎమ్మెల్యే 'బీఆర్‌ఎస్‌కు పోతాడో.. కాంగ్రెస్ పోతాడో అని చాలా అనుమానాలు ఉన్నాయి. అలా జరగడానికి వీల్లేదు. మేం కాంగ్రెస్ పార్టీ బతకాలని పార్టీ కోసం పని చేస్తున్నాం.' అంటూ పరిశీలకుల ముందే అసహనం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం మొత్తం ఎమ్మెల్యే వివేక్ ముందే జరగడం, ఆయన ఉన్న మీటింగ్‌లోనే కార్యకర్తలు, నాయకులు తిరగబడడం గమనార్హం. ఇది జరిగిన రెండు రోజులకు ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రొటోకాల్ ఇవ్వడం లేదని, కాళేశ్వరం పుష్కరాలకు ఆయనను పిలవలేదని, ఫ్లెక్సీల్లో ఆయన ఫొటోలు పెట్టలేదని వంశీ వర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిరసన తెలిపేందుకు వచ్చారు. కానీ స్థానిక ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ వర్గీయులు వారిని అడ్డుకున్నారు. గడ్డం వివేక్, వంశీ ఇద్దరు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీని చీల్చేందుకు కుట్రలు చేస్తున్నారని, సొంత కేడర్‌ను డెవలప్ చేసుకుంటూ అన్నదమ్ముల్లాంటి కార్యకర్తలను విడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పీఎస్‌ఆర్ వర్గీయులు విమర్శలు గుప్పించారు. మంచిర్యాలలో అలా చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఇక బెల్లంపల్లిలోనూ స్థానిక ఎమ్మెల్యే వినోద్ విషయంలో కార్యకర్తలు రెండుగా చీలిపోయారు. పార్టీలో కొత్త, పాత వివాదం నడుస్తుంటే ఎమ్మెల్యే మంత్రి పదవి పోటీలో పడి కార్యకర్తలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటు విషయంలో బెల్లంపల్లి కార్యకర్తలు, నాయకులు ఇటీవల కాలంలో బహిరంగంగానే ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లతో గెలిచిన గడ్డం ఫ్యామిలీ పార్టీ నాయకులు, కార్యకర్తలను విభజిస్తూ సొంత కేడర్‌ను తయారు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారంటూ కొందరు నాయకులు మండిపడుతున్నారు. పార్టీ వ్యతిరేకత కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆ కుటుంబంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇలా కాకా వారసులపై ఎక్కడికక్కడ సొంత పార్టీ కార్యకర్తలు, నాయకుల నుంచి వ్యతిరేకత, తిరుగుబాటు వస్తుండడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.


### ఎంపీకి ముందు నుంచి దక్కని ప్రొటోకాల్..

వెంకటస్వామి (కాకా) వారసులుగా రాజకీయాల్లోకి వచ్చిన గడ్డం వివేక్, వినోద్ సహా మూడోతరం నుంచి ఎంపీగా గెలిచిన వంశీకృష్ణపైనా సొంత నియోజకవర్గాల్లోని స్థానిక నాయకులే కారాలు, మిరియాలు నూరుతున్నారు. గెలిచే దాకా ఒక లెక్క, గెలిచాక మరో లెక్క అన్నట్లు కాకా కుటుంబం వ్యవహరిస్తుందంటూ పార్టీ మీటింగ్‌లు, ప్రభుత్వ కార్యక్రమాల్లోనే సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నారు. వంశీకృష్ణ ఎంపీగా గెలిచాక పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో బెల్లంపల్లి, చెన్నూర్ మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఆయనను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎంపీగా గెలిచిన నాటి నుంచి ఏనాడూ ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వడం లేదని తెలిసింది. ఈ విషయంపై ఎంపీ వంశీ గతంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలోనే ఓ మీటింగ్‌లో అసహనం వ్యక్తం చేశారు. అంత జరిగాక కూడా మంచిర్యాలలో దవాఖాన శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీని పిలవకపోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక తాజాగా సొంత పార్లమెంట్ నియోజకవర్గం పెద్దపల్లి పరిధిలోనే జరుగుతున్న కాళేశ్వరం పుష్కరాల్లో అధికారులు ఎంపీ విషయంలో ప్రొటోకాల్ పాటించలేదు. ఎంపీని ఆహ్వానించలేదని, ఫ్లెక్సీల్లో ఫొటోలు కూడా పెట్టలేదని పుష్కరాల ప్రారంభ కార్యక్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ముందే వంశీ అనుచరులు నిరసన వ్యక్తం చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇలా ఎక్కడికక్కడ పార్టీ ఎమ్మెల్యేల నుంచి సహకారం లేకపోవడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల నుంచి వ్యతిరేకత పెరగడం కాకా కుటుంబానికి తలనొప్పిగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీలో కాకా కుటుంబానికి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### చెన్నూర్‌లో షాడో ఎమ్మెల్యే డామినేషన్..

చెన్నూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన ఓ నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిచాక వివేక్ పక్కనపెట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆయన పాత కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానికంగా షాడో ఎమ్మెల్యేగా చెలామణి అవుతున్నారు. వివేక్ స్థానికంగా అందుబాటులో లేకపోవడం ఆ నేత మరింత కలిసి వస్తున్నట్లు తెలిసింది. కాగా తాజాగా షాడో ఎమ్మెల్యేను వివేక్ టైట్ చేసినట్లు తెలిసింది. ఆయన గానీ, ఆయన అనుచరులు గానీ వస్తే ఎలాంటి పనులు చేయొద్దంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఈ ఇద్దరి మధ్య దూరం పెరిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుంది. పార్టీ పదవుల విషయంలో ఎవరికి వారు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే వివేక్ సూచించిన నాయకులకు కాకుండా ముందు నుంచి పార్టీని పట్టుకొని పని చేస్తున్న నాయకులకే పదవులు ఇవ్వాలంటూ షాడో ఎమ్మెల్యే వర్గం తిరుగుబాటు రాగం ఎత్తుకున్నదని తెలిసింది. ఇది కాస్త పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుల ముందు ఎమ్మెల్యేపై విమర్శలు చేసే దాకా వెళ్లిందనే టాక్ నడుస్తున్నది. చెన్నూర్ మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రస్తుతం ఎవరికి వారు పట్టుపడుతున్నట్లు సమాచారం. షాడో ఎమ్మెల్యే తన వర్గానికి చెందిన నాయకులకు చైర్మన్ పదవి ఇప్పించాలని చూస్తుంటే.. ఎమ్మెల్యే మరో పేరును ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో భీమారం మండలానికి చెందిన ఓ యువనాయకుడు సైతం ఇప్పటికే పార్టీకి అల్టిమేటం ఇవ్వడం గమనార్హం. ముందు నుంచి పార్టీ కోసం కష్టపడిన యువకుడిగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు ఆయన గతంలోనే ఎమ్మెల్యేకు బహిరంగ వీడియో విడుదల చేశారు. చెన్నూర్ మార్కెట్ పదవి ఎప్పుడూ కోటపల్లి, చెన్నూర్ నాయకులకే ఇస్తున్నారని.. ఈ సారి భీమారం నాయకులకు అవకాశం ఇవ్వాలంటూ సదరు యువనేత ఎమ్మెల్యేపై మంత్రుల స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ పార్టీ పదవి ఇవ్వని పక్షంలో ఆయన మరో పార్టీలో చేరుతారని సన్నిహితులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వివేక్ స్థానిక నాయకుల నుంచి వ్యతిరేకత ఎక్కువైపోవడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికైనా కాకా వారసులు సొంత కేడర్ కోసం ప్రయత్నించకుండా ఉన్న కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని లేదంటే ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పులిని హతమార్చిన కేసులో 30 మంది రిమాండ్



పులి కళేబరాన్ని ఖననం చేస్తున్న అధికారులు (ఫైల్)

పెంచికల్ పేట్, మే 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ పెంచికల్ పేట్ మండలం ఎల్లూరు నల్లకుంట వద్ద ఈ నెల 14న విద్యుత్ తీగలు అమర్చి పులిని హతమార్చిన కేసులో ప్రమేయం ఉన్న 30 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ అధికారి సుశాంత్ సుకుద్దేవ్ బోబాడే శనివారం తెలిపారు. విద్యుత్ షాక్ ఇచ్చి పులిని హతమార్చి చర్మం, గోళ్లు, మీసాలు, దంతాలు తీసుకెళ్లిన ఘటనలో అనుమానితులను అదుపులో తీసుకొని అధికారులు విచారణ చేపట్టారు. కేసులో ప్రమేయం ఉన్న 30 మందిని సిర్పూర్ సివిల్ కోర్టులో హాజరుపరుచగా, 14 రోజుల జుడిషియల్ కస్టడీ విధించింది. వారిని ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించారు. రిమాండ్ అయిన వారిలో అప్పాజీ శ్రీనివాస్, అప్పాజీ వెంకటేశ్, ఎల్కర్ శేఖర్, రోహిణి శ్రావణ్, చప్పిడే అశోక్, చాపిడే పవన్ కుమార్, ఎల్కరి ప్రకాశ్, బుర్రి వెంకటేశ్, కాటేల సాగర్, నికాడి వెంకటేశ్, లాత్కరి శ్రీనివాస్, భింకరి వెంకటేశ్, బింకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓంద్రె సంతోష్, తుమ్మిడే శ్రీనివాస్, ఎల్కరి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓంద్రె నారాయణ, లేగల వెంకటేశ్, గోమాసి రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ,ఎల్లూరి లచ్చన్న, మౌల్కర్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమ్మిడె సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఆగని 'నకిలీ' దందా

## ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద మొత్తంలో పట్టుబడుతున్న నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలు

తాజాగా కాగజ్‌నగర్‌లో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలతో ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, పోలీసులు

*నకిలీ పత్తి విత్తనాల దందా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జోరుగా సాగుతున్నది. అక్రమ సంపాదనకు అలవాటుపడిన వ్యాపారులు, దళారులు జిల్లాలోకి పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తూ అమాయక రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా నకిలీ విత్తనాల దందా మాత్రం ఆగడం లేదు. గత రెండు నెలల్లో మూడు చోట్ల పోలీసుల తనిఖీల్లో సుమారు రూ.82 లక్షల విలువైన 27 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలు పట్టుబడడమే నకిలీ దందాకు నిదర్శనమని చెప్పవచ్చు.*

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా ప్రతి యేటా సీజన్‌కి ముందు నకిలీ విత్తనాలు జిల్లాలోకి వస్తున్నాయి. అడ్రస్ లేని కంపెనీల్లో తయారైన నకిలీ విత్తన ప్యాకెట్లపై విత్తనాలు తయారీ తేదీ గానీ, వాటి వ్యాలిడిటీ గానీ, తదితర వివరాలేవి ఉండవు. గోనే సంచుల్లో నకిలీ విత్తనాలు గ్రామాల్లోకి చేరవేసి అమాయక రైతులకు అంటగడుతున్నారు. కొందరు ఒరిజినల్ ప్యాకెట్ల రూపంలో వీటిని విక్రయిస్తుండడంతో రైతులు కొనుగోలు చేసి దిగుబడి రాక నష్టపోతున్నారు. నిషేధిత పత్తి విత్తనాలు, గ్లైసిల్‌ను అరికట్టేందుకు ప్రతి సంవత్సరం అధికారులు బృందాలుగా ఏర్పడి అన్ని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి సరఫరా అయ్యే నకిలీ విత్తనాలపై నిఘా పెడుతున్నారు. గతంలో నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ పట్టుబడిన వారిపై కూడా దృష్టి సారిస్తున్నారు. అయినప్పటికీ జిల్లాలో లైసెన్స్ పొందిన డీలర్ల అండదండలతోనే దళారులు పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### రెండు నెలల్లో 27 క్వింటాళ్ల పట్టివేత..

గత రెండు నెలల క్రితం చింతలమానేపల్లిలో రూ.10.50 లక్షల విలువైన 3 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. 15 రోజుల క్రితం రూ.12 లక్షల విలువైన 4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా శనివారం రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల బీటీ-3 నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లా నుంచి కాగజ్‌నగర్‌కు 20 క్వింటాళ్ల బీటీ-3 నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా ఆధోనికి చెందిన పుప్పాల లక్ష్మణ్, మహారాష్ట్ర అహేరికి చెందిన సంతోష్ కిశోర్‌ను అరెస్ట్ చేయగా సిరిసిల్లా జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన వేణుగోపాల్ రెడ్డి పరారీలో ఉన్నాడని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాస్ రావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా విక్రయిస్తే సమాచారం అందించాలని రైతులను కోరారు.

# వాన..వరద

- గుండి వాగుపై తెగిన తాత్కాలిక వంతెన
- వరదలో చిక్కుకపోయిన ఆటో
- ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం
- ఉప్పొంగిన గోండు కోసార వాగు



ఆసిఫాబాద్ మండలంలో గుండి వాగుపై తెగిన తాత్కాలిక వంతెన, ప్రవాహంలో కొట్టుకపోయిన ఆటో

ఆసిఫాబాద్ టౌన్, మే 24 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వాగులు ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం రాత్రి గుండి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరదకు కొట్టుకపోయింది. అదే సమయంలో వంతెనపై నుంచి వెళ్తున్న ఆటో ఒక్కసారిగా వరదలో చిక్కుకపోయింది. అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు, డ్రైవర్ అప్రమత్తమై బయటకువచ్చారు. వరదలో ఆటో కొంత దూరం కొట్టుకపోయింది. స్థానికుల సహాయంతో ఆటోను బయటికి తీశారు. దీంతో శనివారం నుంచి జిల్లా కేంద్రం నుంచి గుండి గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వాంకిడి : గోండు కోసార వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

### ఉప్పొంగిన గోండు కోసార వాగు..

వాంకిడి, మే 24 : వాంకిడి మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గోండు కోసార వాగు ఉధృతంగా ప్రవహించింది. శనివారం కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులతో కలిసి గోండు కోసార వాగును పరిశీలించారు. గోండు కోసార గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎల్పీవో ఉమర్, తహసీల్దార్ రియాజ్ అలీ, డాక్టర్ వినయ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.